పవన్ కల్యాణ్ రాజకీయ అజ్ఞాని

- వలంటీర్లను హ్యూమన్ ట్రాఫికింగ్ మాఫియాతో పోల్చుతున్నాడు
- పవన్ దిష్టిబొమ్మతో వలంటీర్ల నిరసన ర్యాలీ
- చెప్పులు, పొరకలతో కొట్టి దిష్టిబొమ్మ దహనం


పుత్తూరులో పవన్ పోస్టర్‌ను చీపుర్లతో కొడుతున్న వలంటీర్లు

నగరి : నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారికిచ్చిన 50 నివాసాల ప్రజల అవసరాలను కనుగొని వాటిని పరిష్కరిస్తూ.. సంక్షేమ పథకాలను వారికి అందిస్తూ.. తలుపు తట్టి మరీ పెన్షన్ ఇస్తూ.. లబ్ధిదారుల సుదూర ప్రాంతంలో ఉన్నా వెతుక్కుంటూ వెళ్లి పెన్షన్ అందించడంతో పాటు కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు సైతం లెక్క పెట్టక ప్రజలు సేవలు అందించిన వలంటీర్లను హ్యూమన్ ట్రాఫికింగ్ మాఫియాతో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పోల్చడంపై వలంటీర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మతో ప్రజాప్రతినిధులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం పవన్ దిష్టిబొమ్మను చీపురుతో, చెప్పులతో కొట్టిన వలంటీర్లు దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లంటే పవన్ కల్యాణ్‌కు చులకన అయిపోయిందన్నారు. ఆయన వార్డుల్లో ఒంటరి మహిళలు, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న మహిళలు ఎక్కడ ఉన్నారని తెలుసుకుని వారి వివరాలు సేకరించి వారిని ఎలా ట్రాప్ చేయాలో సంఘ విద్రోహ శక్తులకు వలంటీర్లు సమాచారం అందిస్తున్నారని పవన్ కల్యాణ్ నోటికొచ్చినట్లు వాగుతున్నారన్నారు. ఆయనకు మతి చెడిందని ఒక్కో సభలో ఒక్కో విధంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఆడవారిని ట్రాప్ చేసే నీచ సంస్కృతి వలంటీర్లకు లేదన్నారు. పచ్చకామెర్లు ఉన్నవాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు పవన్‌కల్యాణ్ ధోరణి ఉందన్నారు. వలంటీర్లలో 70 శాతం మంది మహిళలే ఉన్నారన్న విషయం కూడా పవన్‌కల్యాణ్‌కు తెలియకపోవడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ఆయన వ్యాఖ్యలు ఈ రాష్ట్రం మీద, ఇక్కడ ప్రజల మీద ప్రేమ, మమకారం కాకుండా విపరీతమైన ద్వేషం, ఆగ్రహం ఉన్న వ్యక్తి చేసిన వ్యాఖ్యల్లా ఉన్నాయన్నారు. అసలు వలంటీర్ అంటే అర్థం తెలుసా? వారు చేసే పని తెలుసా ? అని ప్రశ్నించారు. తమపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు పవన్‌కల్యాణ్ క్షమాపణలు చెప్పాలంటూ తీవ్రంగా హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలోని వలంటీర్లతో పాటు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, వైస్‌చైర్మన్ బాలన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు బిలాల్, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, ఆనంద్‌కుమార్, యాకోబు, చిన్నదొరై తదితరులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రం నింద్రలో వలంటీర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లను కించ పరుస్తూ మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

పవన్‌ను అరెస్ట్ చేసి విచారించాలి..

పుత్తూరు రూరల్: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వివాదం మరింత ముదురుతోంది. మంగళవారం పుత్తూరులో మహిళా వలంటీర్లు పవన్ పోస్టర్లను చీపుర్లతో కొట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ పవన్‌ను దిశా చట్టం కింద అరెస్ట్ చేసి విచారించాలని డిమాండ్ చేశారు. పుత్తూరు రూరల్ మండల పరిధిలోని వలంటీర్లు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ఏమాత్రం ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్న ప్యాకేజీ స్టార్‌ను మానసిక వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమకు బాధ్యతాయుతమైన ఉద్యోగాలు ఇస్తే ఓర్వలేక, ఇలా తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. పవన్ తక్షణం వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.


పవన్ దిష్టిబొమ్మను చీపురుతో కొడుతున్న దివ్యాంగ వలంటీర్లు


నింద్రలో పవన్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న వలంటీర్లు

అంత నీచులమా..!



వలంటీర్లు అంటే పవన్‌కు చులకన భావం ఉన్నట్లుంది. మేము ప్రజలకు సేవ చేసేవాళ్లమే కానీ ఒంటరి మహిళలను ట్రాప్ చేసి విక్రయించే నీచులం కాదు. వలంటీర్లలో 70 శాతం ఉన్నది మహిళలే. మా విధులను కించపరిస్తే మేం ఊరుకోం. డైలాగ్‌లు చెప్పి వెళ్లిపోవడానికి బహిరంగ వేదికలు సినిమా షూటింగ్‌లు కావు. వలంటీర్లకు పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాల్సిందే.

– ఎం.మునెప్పన్, వలంటీర్, వెస్ట్ సచివాలయం, నగరి

క్షమాపణ చెప్పాలి



వాలంటీర్లను కించపరిచేలా మాట్లాడిన పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాలంటరీ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో అవినీతి లేని పాలన జరుగుతున్నాయి. అలాంటి వాలంటరీ వ్యవస్థ పై పవన్ కళ్యాణ్ దుష్ప్రచారం చేయడం సిగ్గు చేటు. వలంటరీ వ్యవస్థాపనకు ప్రతి అన్నం తింటూ ఆరోగ్యంగా ఉన్నారు

– వినోద్ కుమార్, వలంటీర్, కేవీపురం, విజయపురం మండలం

అన్నీ వెర్రి వేషాలు..



పవన్ కల్యాణ్ వారాహి యాత్రలో వెర్రి వేషాలు, వికృత కూతలు తప్ప, బాధ్యతాయుత స్పీచ్ ఎక్కడ ఉంది? తనకు అధికారం ఇస్తే ప్రజలకు ఈ మేలు చేస్తానంటూ స్పష్టంగా చెప్పిన దాఖలాలు లేదు. మూడు పెళ్లిళ్లు చేసుకున్న పవన్ మహిళలకు మంచి చేస్తాడన్న నమ్మకం లేదు. మహిళా వలంటీర్ల గురించి ఏమాత్రం అవగాహన లేకుండా మాట్లాడడం అతని అజ్ఞానానికి నిదర్శనం.

– వి.ఇందుప్రియ, వలంటీర్, కొత్తవీధి, పుత్తూరు

రెచ్చగొట్టే ప్రసంగాలతో ఓట్లు రావు..



రెచ్చగొట్టే ప్రసంగాలతో ఓట్లు వస్తాయనుకోవడం పవన్ కల్యాణ్ అవివేకానికి నిదర్శనం. అసలు నీ ప్రసంగాలను వింటూ నీతోపాటు ఊగుతున్నది ఎవరు? ఓటు హక్కు లేని నీ పిచ్చి అభిమానులు కాదా..! మహిళలకు గౌరవం ఇవ్వని నువ్వు మహిళా వలంటీర్ల గురించి మాట్లాడడం దురదృష్టకరం. 2024 ఎన్నికల్లో ఆ ఒక్క సీటును కూడా నీకు కట్టబెట్టే పరిస్థితి లేదు. ఎందుకంటే నువ్వు పని చేస్తున్నది కేవలం బాబు ప్యాకేజీ కోసం అని అందరికీ తెలుసు.

– ఎస్.లావణ్య, వలంటీర్, సత్యనారాయణ కాలనీ, పుత్తూరు

పవన్ మాటలు దుర్మార్గం



నా పేరు టీఆర్.హరికృష్ణ, ముడిపల్లి. నాలుగేళ్లుగా వలంటీర్‌గా పని చేస్తున్నా. 2020 ఆగస్టులో ముడిపల్లికి చెందిన ముగ్గురు కోవిడ్ సోకితే నేను పుత్తూరులో ఉన్న క్వారంటైన్‌లో చేర్చా. తరువాత వారికి పింఛన్ నగదు అవసరం అని తెలిసి కూడా అక్కడికి వెళ్లి పెన్షన్ అందజేశా. నేను పవన్‌కల్యాణ్ అభిమానినే, ఆయన సామాజిక వర్గానికి చెందిన వాడినే. కానీ మా వలంటీర్లను హ్యూమన్ ట్రాఫికింగ్ మాఫియాతో ఆయన పోల్చడం దుర్మార్గం.

– హరికృష్ణ, వలంటీర్,

క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

విజయపురం (నగరి): విజయపురం మండలం మాధవరం ప్రభుత్వ ఐటీఐ (పన్నూర్ సబ్‌స్టేషన్ దగ్గర) 2023–24 సంవత్సరానికి గానూ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గణేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని లేదా సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో పాటు ఫొటోలు జతచేసి ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో సమర్పించాలని ఆయన తెలిపారు. అలాగే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీ ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 8639790174, 6303156450, 9494434236, 9177035120 సంప్రదించాలని సూచించారు.

11, 12 వార్డుల్లో జగనన్న సురక్ష రేపు

నగరి : మున్సిపాలిటీకి చెందిన 11, 12 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను బుధవారం ఇందిరానగర్ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో పాటు, తహసీల్దార్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొంటారన్నారు.

నేడు వాహనాల వేలం

నగరి : వివిధ కేసుల్లో పట్టుబడి నగరి పోలీస్ స్టేషన్‌లో ఉన్న వాహనాలను బుధవారం వేలం వేస్తున్నట్లు సీఐ శ్రీనివాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉండి జీఎస్టీ కలవారు వాహనాలను వేలంలో పొందవచ్చన్నారు. వేలం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు.

రేపు బాబా ఆలయంలో పాలాభిషేకం


ప్రత్యేక అలంకరణలో ఆలయం

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం పాలాభిషేకానికి ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల స్వహస్తాలతో నిర్వహించే పాలాభిషేకానికి పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తులను క్రమపద్ధతిలో అనుమతించేందుకు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. గురువారం వేకువజామున 2.30 సుప్రభాత సేవ, 3.30 గంటలకు కాగడ హారతి ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, 12.30 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు సంధ్యా హారతి, 8 గంటలకు పవళింపు హారతి ఇస్తారు. పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాలు విద్యుత్ దీపకాంతుల్లో మిరిమిట్లు గొల్పుతున్నాయి.

స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్‌గా నాగరాజు

విజయపురం (నగరి) : మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్‌గా నాగరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను గతంలో సాక్షర భారత్ కోఆర్డినేటర్‌గా ఎనిమిదేళ్ల విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పరిసరాల శుభ్రత, స్వచ్ఛతపై అవగాహన కల్పించి చైతన్యం తీసుకొస్తా అన్నారు.

బాలాజీ సేవలు ఎనలేనివి


బాలాజీ జన్మదిన వేడుకల్లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: మండల అభివృద్ధికి గతంలో శ్రీరాములు నాయుడు ఎనలేని సేవలు అందించారని, అదేబాటలో పయనిస్తూ ఆయన తనయుడు బాలాజీ కూడా ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. మంగళవారం మండలకేంద్రంలో జరిగిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ జన్మదిన వేడుకల్లో భాగంగా మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలాజీ దంపతులకు మంత్రి పుష్పగుచ్ఛం అందించి శాలువలతో సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ బాలాజీ, ఆయన భార్య లత ఎంపీపీ హోదాలో ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శేఖర్‌రాజు, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనుంజయవర్మ, జేసీఎస్ మండల కన్వీనర్ పురంధర్, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ సుగుణమ్మ, వైస్ ఎంపీపీలు కార్తీక్‌రెడ్డి, మణెమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ప్రజలకు శ్రీరామరక్ష


ఎస్వీపురంలో సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో రామ్‌ప్రసాద్‌రెడ్డి


ఎలకాటూరులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దీప

కార్వేటినగరం: జగనన్న సురక్షతో సమస్యలకు చెక్ పెట్టవచ్చని ఎంపీపీ లత అన్నారు. మంగళవారం స్థానిక 3వ సచివాలయంలో మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయవర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ లత మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు శ్రీరామరక్ష లాంటిదన్నారు. ప్రజాసమస్యలను ఈ సురక్ష కార్యక్రమంలో పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. అనంతరం ప్రత్యేక అధికారి త్రిహాల్, ఎంపీడీఓ మోహన్‌మురళి మాట్లాడుతూ ఇప్పటివరకు 170 ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, అందులో 132 వినతులను పరిష్కరించడం జరిగిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎంపీపీ చేతుల మీదుగా ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌మురళి, డీటీ తహసీల్దార్ లక్ష్మీపతి, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, ఈఓ పీఎస్ మణి, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

నింద్ర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కారం చేసుకోవాలని ఎంపీపీ దీప అన్నారు. మంగళవారం మండలంలోని ఎలకాటూరు సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ అమరేంద్రబాబు, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, కోఆప్షన్ సభ్యులు అనిల్, మండల ప్రత్యేక అధికారి సతీష్ కుమార్, సర్పంచ్ చంద్రబాబు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

పుత్తూరు రూరల్/నగరి: ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్న పథకమే జగనన్న సురక్ష పథకమని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం పుత్తూరు రూరల్ మండలం నేసనూరు, వడమాలపేట మండలం ఎస్వీపురం సచివాలయ పరిధిలో, నగరి మండలంలోని బీరకుప్పం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని తెలిపారు. గతంలో ఒక్క సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే దుస్థితి ఉండేదని, నేటి సురక్ష పథకం ద్వారా పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్నను, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజల కోసం అహర్నిశలు కష్టపడుతున్న మంత్రి ఆర్‌కే రోజాను నగరి నుంచి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం సురక్ష లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, సర్పంచులు గోవిందస్వామి రెడ్డి, మురళియాదవ్, వేలాయుధం, నాయకులు రాంబత్తయ్య, కాంతమ్మ, నగరి ఎంపీపీ భార్గవి, ఎంపీడీఓ లీలామాధవి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రత్యేక అధికారి వాసు, మండల సచివాలయ కన్వీనర్ హరి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, వడమాలపేట మండల నాయకులు నందయ్య, సుబ్రమణ్యంరెడ్డి, ఉపేంద్ర, లోకేష్‌రెడ్డి, ఉమాపతి, సురేష్‌రాజు, దొరస్వామి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాలసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తోందని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం పద్మపురం, పిళ్లారికుప్పం సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, సర్పంచులు భాస్కర్ నాయుడు, రూపా, లోకేష్, ఎంపీటీసీ మునిరాజులు నాయుడు, అధికారులు మండల కన్వీనర్ మణి, పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు శ్రీరామరక్ష అని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. మంగళవారం పాలసముద్రం సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, తహసీల్దార్ బాబు సమీక్షంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అనంతరం వారు పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, ఎంపీటీసీ గోవిందరాజు, రిటైర్డ్ హెచ్ఎం స్వామిరాజు, రాజామణి, మండల విస్తరణాధికారి రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి


వీరగనెల్లూరులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- డిప్యూటీ సీఎంకే నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే కులమతాలకు, పార్టీలకు అతీతంగా కేవలం అర్హత ఉంటే చాలాఉ సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీదేనని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. వీరగనెల్లూరు గ్రామ సచివాలయ పరిధిలోని వీరగనెల్లూరు, పేటనత్తం, సింగరాయికండ్రిగ, ఏడీ కండ్రిగ సర్పంచ్ అమరావతి, ఎంపీటీసీ ఇందిరకోదండన్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానిక అధికారులు, పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల వర్తింపు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంక్షేమ బావుటా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇంతటి సంక్షేమం, అభివృద్ధి టీడీపీ పాలనలో జరిగిందా అని ప్రశ్నించారు. ఇప్పుడు జగనన్న కాలనీల్లో ఏకంగా కొత్త గ్రామాలే వెలుస్తున్నాయని, రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలను గమనించిన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కొందరు పరిశీలించేందుకు ఏపీకి వస్తున్నారని తెలిపారు. మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీపీ అనితారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ వెంకటేష్ రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, ప్రగతి కరుణాకర్, వెంకట్ రెడ్డి, సురంద్రరెడ్డి, సదాశివరెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్ తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

విపక్షాల గల్లంతు ఖాయం..

పాలసముద్రం : రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే హవా ముందు టీడీపీ, జనసేన పార్టీ గల్లంతు కావడం ఖాయమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మంగళవారం వీరగనెల్లూరు గ్రామ సచివాలయ పరిధిలో గడప గడప మన ప్రభుత్వం పూర్తయిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పార్టీ పెట్టినప్పటి నుంచి ఏరోజు కూడా మాట మీద స్థిరంగా లేని పవన్‌కల్యాణ్ ఏనాటికీ రాజకీయ నాయకుడు కాలేడన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే శక్తి జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు లేదపకపానేజ ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీపీ అనితారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, ఎంపీటీసీ ఇందిరకోదండన్, మాజీ ఏఎంసీ చెర్మన్ చిన్నమరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ వెంకటేష్ రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, ప్రగతి కరుణాకర్, వెంకట్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, సదాశివరెడ్డి, స్థానిక సర్పంచ్ అమరావతి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాదన్ మండల స్థాయి అధికారులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణకు కృషి చేద్దాం


కార్వేటి నగరంలో వైద్య సిబ్బంది ర్యాలీ


నింద్ర మండలకేంద్రంలో ..


పాలసముద్రంలో కుటుంబ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కార్వేటినగరం: నేటి ప్రపంచంలో చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో అవగాహన కల్పించి బాల్యవివాహాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. అమ్మాయి వయసు 18 పైన, అబ్బాయికి 21 పైన ఉండాలని తెలిపారు. కుటుంబ నియంత్రణతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కుటుంబ నియంత్రణ పాటించాలని సూచించారు. అనంతరం గ్రామవీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండలకేంద్రం నింద్రలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల వైద్యసిబ్బంది, వైద్యాధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక జనాభా అనర్థాలకు మూలం అన్నారు. చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అని జనాభా నియంత్రణ అందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణకు సహకరించాలని కోరారు. ర్యాలీ బస్టాండ్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కల్యాణి, సుమలత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : జనాభా నియంత్రణతో కుటుంబ సంక్షేమం దిశగా ఒక అర్థవంతమైన భవిష్యత్‌కు ప్రారంభం అని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌కృష్ణ, సీహెచ్ఓ జ్ఞానశేఖర్ తెలిపారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలసముద్రం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది మండల కేంద్రం వరకు ర్యాలీ చేశారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : దేశంలో జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో దేశం ప్రథమ స్థానంలో ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని సూచించారు. అనంతరం పురవీధుల్లో ఆరోగ్య సిబ్బందితో కలసి ప్లకార్డులతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిత, ఇతర నాయకులు పాల్గొన్నారు.


శ్రీరంగరాజపురంలో ప్లకార్డులతో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

ముత్యాలమ్మకు పొంగళ్లు


పొంగళ్లను ఊరేగింపుగా తెస్తున్న మహిళలు, పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): పెనుమూరు గ్రామదేవత ముత్యాలమ్మకు మంగళవారం పరిసర గ్రామాల ప్రజలు భక్తి శ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. ముందుగా ఉదయం ఆయా గ్రామాల్లో సత్తెమ్మకు చల్ల పోశారు. ఆనవాయితీగా ఆలయ ధర్మకర్త జంబుగోళం భాస్కర్ ఆధ్వర్యంలో పెనుమూరులోని సత్తెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్రప్రభుత్వ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు ముత్యాలమ్మకు తొలిపూజ, అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం పరిసర గ్రామస్తులు పొంగళ్లతో ఊరేగింపుగా డప్పు వాయిద్యాల మధ్య పెద్దఎత్తున బాణసంచా పేల్చుతూ ముత్యాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మహాసముద్రం హేమలత, జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.